క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు సొండిపూడి విద్యార్థులు


విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కాశీబుగ్గ: విజయవాడలో ఈనెల 30వ తేదీన జరగనున్న రాష్ట్రస్థాయి కొలిల్ పోటీలకు మందస మండలం సొండిపూడి పాఠశాలకు చెందిన డొక్కరి మాధవి, భాగ్యలక్ష్మి పాణిగ్రాహీలు ఎంపికయ్యారు. వీరు శనివారం ఇక్కడ నుంచి బయలుదేరి వెళ్లారు. విజేతలుగా రావాలని ప్రధానోపాధ్యాయులు బుగత సుందరసాల్మన్, గైడ్ ఎస్.అప్పారావు, ఉపాధ్యాయులు నగిరి కరుణాకర్, వై.తులసీదాస్, ఎస్.నారాయణరావు, కె.వి.రమణ, చంటిబాబు, జ్యోస్న ఆకాంక్షించారు.

మొక్కల పెంపకం సామాజిక బాధ్యత


మొక్కలు నాటుతున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

ఇచ్ఛాపురం: మొక్కలు పెంచడం సామాజిక బాధ్యతగా ప్రతిఒక్కరూ భావించాలని స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.శంకరరావు అన్నారు. కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా మొక్కల ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ఎన్ఎస్ఎస్ పీవో రజనీకుమారి, సిబ్బంది సుధాకర్, యుగంధర్, బాపూజీ, ప్రసాదరావు, జగదీష్, కరుణాకరరావు, సునీత పాల్గొన్నారు.

జాగృతి సేవలు అభినందనీయం


సోంపేట: జాగృతి స్వచ్ఛంద సేవాసంస్థ ద్వారా 16 సంవత్సరాలుగా అందిస్తున్న సేవలు అభినందనీయమని తహసీల్దార్ బి.అప్పలస్వామి అన్నారు. కొర్లాం గ్రామంలో జాగృతి స్వచ్ఛంద సేవా సంస్థ 16వ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రాంబుడ్డి గణపతి మాట్లాడుతూ.. సమాజంలో ప్రతీ వ్యక్తి మంచి స్వభావాన్ని అలవర్చుకోవాలన్నారు. ఆనందమయ జీవితం కేవలం మనిషి నైతిక సంస్కారం వలనే సాధ్యం అవుతుందన్నారు. ఈ సందర్భంగా కళాకారులు సత్కరించారు.

వేతన బకాయిలు చెల్లించాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో జయంతి ప్రసాద్

సంతబొమ్మాళి: తమ వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని ఎంపీటీసీ సభ్యులు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల పరిషత్ 2024–25 ఆర్థిక సంవత్సర సవరణ బడ్జెట్ 2025–26 సంవత్సరపు బడ్జెట్ సమావేశాలు నిర్వహించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికిగాను 51 కోట్ల 78 లక్షల 2,945 రూపాయలతో సవరణ బడ్జెట్, 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను 57 కోట్ల 8 లక్షల 62,804 రూపాయలతో ఆమోదించారు. సమావేశంలో ఎంపీపీ మెరుగు రాజేశ్వరి, జెడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి, ఎంపీడీవో జయంతి ప్రసాద్ పాల్గొన్నారు.

చిన్నారులకు ఆధార్ తప్పనిసరి


చిన్నారుల ఆధార్ నమోదును పర్యవేక్షిస్తున్న నాగరాణి

ఇచ్ఛాపురం రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఉండే 0–6 ఏళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా ఆధార్‌కార్డు ఉండాలని ఇచ్ఛాపురం రూరల్ సీడీపీఓ పురాణం నాగరాణి అన్నారు. శుక్రవారం ఆమె మండపల్లి గ్రామ సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ నమోదు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మండపల్లి పంచాయతీ పరిధిలో ఉండే అంగన్‌వాడీ చిన్నారులకు ఆధార్ కార్డుల కోసం అనుసంధానం చేశారు. సూపర్‌వైజర్ ఆర్.నీలవేణి ఉన్నారు.

కలుషిత నీరే గతి!

- రక్షిత మంచినీటి ట్యాంకు లీకు
- కుళాయిల ద్వారా రంగు మారిన నీటి సరఫరా


రంగుమారిన నీటిని పట్టుకుంటున్న ఈదుపురం వాసులు

ఇచ్ఛాపురం రూరల్: శీతాకాలంలో వర్షాలు కురిశాయి. దీంతో రోగాలు ప్రబలే అవకాశం ఉంది. ఈ పరిస్థితిలో ప్రజారోగ్యం కోసం అధికార యంత్రాంగం తగిన జాగ్రత్తలు పాటించాలి. మంచినీటి సరఫరాలో జాగ్రత్తలు పాటించాల్సి ఉంది. అయితే చాలా గ్రామాల్లో ఈ పరిస్థితి లేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. రక్షిత మంచినీటి పథకంతో నిత్యం కుళాయిల ద్వారా సరఫరా అయ్యే తాగు నీటిని శుద్ధి చేయడంలో విఫలమవుతున్నారు. దీంతో కలుషిత నీరు తాగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మండలంలోని ఈదుపురం గ్రామం నడిబొడ్డున 25 ఏళ్ల క్రితం సుమారు రెండున్నర లక్షల లీటర్ల సామర్థ్యంతో రక్షిత మంచినీటి ట్యాంకును, సంప్‌ను నిర్మించారు. చుట్టుపక్కల పాతిక గ్రామాల ప్రజలకు మంచినీరు అందించే ఈ మంచినీటి ట్యాంకు లీకుల మయంతో ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టకపోవడంతో బురద రంగులో నీటిని సరఫరా చేస్తూ ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు.


ఓవర్ హెడ్ ట్యాంకు వద్ద పైపులైన్ లీకు దృశ్యం

కుళాయిల ద్వారా రంగు మారిన నీరు

ఈదుపురం రక్షిత మంచినీటి పథకం ద్వారా పాతిక గ్రామాల్లో రెండు వేలకు పైగా కుళాయిలకు నీటిని సరఫరా చేస్తున్నారు. ఒక్క ఈదుపురంలోనే వందకు పైగా కుళాయిలు ఉన్నాయి. శుద్ధి చేయకుండానే నీటిని సరఫరా చేస్తున్నారని, కొన్ని రోజులుగా బురద రంగులో మారిన నీటిని సరఫరా చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకులు శుభ్రం చేయడం లేదు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని అధికారులు పర్యవేక్షించడం లేదు. ఇటీవల ఈదుపురం గ్రామానికి సీఎం చంద్రబాబు వచ్చిన సందర్భంగా హడావిడిగా ట్యాంకుల వద్ద శుభ్రం చేశారని స్థానికులు చెబుతున్నారు.

లీకులే..లీకులు

ఇచ్ఛాపురం బహుదానది పాతాళేశ్వర ఆలయం నుంచి తాగునీరు ఈదుపురానికి పైపులైను ద్వారా సరఫరా అవుతోంది. రెండు లక్షల సామర్థ్యం గల ఓవర్ హెడ్ ట్యాంకుతో పాటు రెండున్నర లక్షల సామర్థ్యం గల సంప్ ఉంది. ఇచ్ఛాపురం పాత వంతెన వద్ద, ఈదుపురం శ్మశాన వాటిక దారిలో రెండు చోట్ల పైపులైన్ లీకు కావడవంతో నాలుగు గంటల్లో ట్యాంకులకు ఎక్కించాల్సిన నీరు ఇప్పుడు పన్నెండు గంటల సమయం పడుతుండడంతో సరైన సమయంలో ప్రజలకు సంబంధిత సిబ్బంది నీటిని అందించలేకపోతున్నారు. లీకులతో వేల లీటర్ల నీరు వృథాగా పోతుంది. సమస్యను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.విష్ణుమూర్తి వద్ద ప్రస్తావించగా లీకులు జరుగుతున్నట్లు సిబ్బంది తమ దృష్టికి తెచ్చారన్నారు. ఈ విషయాన్ని సంబంధిత కాంట్రాక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రస్తుతం వర్షాలు కురవడంతో మంచినీరు రంగు మారిందని స్పష్టం చేశారు.


విద్యార్థి చేతిలో రంగుమారిన నీటితో వాటర్ బాటిళ్లు

రంగునీటినే తాగుతున్నాం



చాలా రోజుల నుంచి కుళాయిల ద్వారా రంగునీరే వస్తుంది. ఈ నీటినే మేమంతా తాగుతున్నాం. అంతే కాకుండా నీరు కూడా ఎప్పుడు వస్తుందో తెలియడం లేదు. కొన్నిసార్లు నీరు రాకపోవడంతో బహుదా నది నుంచి నీరు తెచ్చుకుంటూ నిత్యావసరాలకు ఉపయోగిస్తున్నాం. అధికారులు స్పందించి మంచి నీటిని సరఫరా చేస్తే బాగుంటుంది.

– టి.సావిత్రి బెహరా, ఈదుపురం

ముస్సిపల్ సమావేశంలో సమస్యల ప్రస్తావన


అయిపోయిన పనులను టెండర్‌లో పెట్టారని చూపిస్తున్న కౌన్సిలర్ పిచ్చుకల అజయ్


పనుల విషయమై ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ బోనెల చంద్రమ్మ

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా ముందుగా మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మృతి సంతాపసూచికగా కొద్దిసేపు మౌనం పాటించారు. అనంతరం పలువురు కౌన్సిలర్లు సమస్యలను ప్రస్తావించారు. కౌన్సిలర్ పిచ్చుకల అజయ్ మాట్లాడుతూ.. అయిపోయిన పనులకు సంబంధించిన టెండర్లను అజెండాలో ఎందుకు చేర్చారని.. బిల్లులు పెట్టుకోవడానికా అని ప్రశ్నించారు. 29వ వార్డు కౌన్సిలర్ బోనెల చంద్రమ్మ మాట్లాడుతూ.. తమ వార్డులో పనులు జరగకుండా జరిగినట్టు అజెండాలో పెట్టారని దుయ్యబట్టారు. కౌన్సిలర్లు గుజ్జు జోగారావు, శంకర్ పండా, బెల్లాల శ్రీనివాసరావు, సనపల సింహాచలం మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో 31వార్డులు ఉన్నప్పటికీ మూడు నెలల కాలంలో కొన్ని వార్డులలో మాత్రమే పనులు నిర్వహిస్తున్నారని.. మిగిలిన వార్డులను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. పారిశుద్ధ్య కార్మికులకు తొమ్మిది నెలలుగా జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని.. ప్రభుత్వ సొమ్ము ఇవ్వడానికి అధికారులకు ఇబ్బందులు ఎందుకని ప్రశ్నించారు. ఈ-ఆటోలు మున్సిపాలిటీలో ఉన్నప్పటికీ ప్రజాధనం వృథా చేస్తున్నారన్నారు. కో-ఆప్షన్ సభ్యుడు బమ్మిడి సంతోష్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో టాయిలెట్లు లేక పట్టణానికి వచ్చే మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మొబైల్ బయోటాయిలెట్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. మున్సిపల్ గ్రంథాలయానికి ఆంగ్లపత్రిక సైతం రావడం లేదని.. అన్ని పత్రికలు వచ్చేలా చూడాలని కోరారు. జోగ త్రివేణి మాట్లాడుతూ.. సమావేశానికి రావడం వృథా అని ఏ పనులు జరగడం లేదని అన్నారు. కౌన్సిలర్లకు తెలియకుండా పనులు చేస్తుంటే తమకు పదవులు ఎందుకన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, కమిషనర్ నడిపేన రామారావు, తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి, మెప్మా సీఎంఎం మోహనరెడ్డి పాల్గొన్నారు.

అలరించిన గణిత అవధానం


గణిత అవధానం నిర్వహిస్తున్న తిరుపతిరావు

కంచిలి: మనసును ఏకాగ్రతతో లగ్నం చేసి, గణన చేయడమే గణిత అవధానం అని గణిత అవధాని మద్దు తిరుపతిరావు అన్నారు. జాతీయ గణిత వారోత్సవాలు సందర్భంగా కత్తివరం ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయురాలు మాధవి బెహరా అధ్యక్షతన శనివారం నిర్వహించిన 263వ గణిత దశావధానం అలరించింది. గణితంలో వివిధ అంశాలైన ఘనమూలాలు, పంచమ మూలాలు, సమస్యా పూరణం, మనో సంకలనం తదితర అంశాలపై ఉపాధ్యాయులు, పృచ్ఛకులుగా ఉంటూ అడిగిన ప్రశ్నలకు అవధాని తిరుపతిరావు మాస్టర్ క్షణాల్లో సమాధానాలు చెపారు. అలాగే చివర్లో అవధాని చేసిన ధారణ కార్యక్రమంలో మొదటి నుంచి చివరి వరకు అడిగిన ప్రశ్న జవాబులు గుర్తుపెట్టుకొని వరుసగా చెప్పడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి బెహరా, మిగతా ఉపాధ్యాయులు తిరుపతిరావునుదుశ్శాలువతో సన్మానించారు.

నేరాల నియంత్రణపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్

సంతబొమ్మాళి: నేరాలు నియంత్రించాలంటే వాటిపై అవగాహన, అప్రమత్తత అవసరమని టెక్కలి రూరల్ సీఐ కె.శ్రీనివాస్ అన్నారు. లక్ష్మీపురం గ్రామంలో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం, ఆన్‌లైన్ మోసాలపై శనివారం అవగాహన కల్పించారు. ప్రలోభాలకు, మోసాలకు గురికాకుండా జాగ్రత్త పడాలని సూచించారు. అత్యవసర సమయాల్లో పోలీసులను సంప్రదించాలన్నారు. సంతబొమ్మాళి ఎస్సై వై.సింహాచలం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బెంతొరియా దీక్షలకు సంఘీభావం


మాట్లాడుతున్న రాజేష్

కవిటి: మండల కేంద్రం కవిటిలో తమ న్యాయపరమైన డిమాండ్ల సాధనకు రిలేనిరాహార దీక్షలు చేస్తున్న బెంతొరియా సంఘం సభ్యులకు జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి లోళ్ల రాజేష్ శనివారం సంఘీభావం ప్రకటించారు. దీక్షలు ప్రారంభించి ఏడాది పూర్తి కావచ్చిన నేపథ్యంలో రాజేష్ శిబిరాన్ని సందర్శించారు. పదిమంది బెంతొరియా సంఘం ప్రతినిధుల బృందం విజయవాడకు బయలుదేరితే డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను కలిసి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని రాజేష్ హామీ ఇచ్చారు. సంఘం ప్రతినిధులు దేవరాజ్ సాహూ, రజనీకుమార్‌దొళాయి ఉన్నారు.

చి'వరి'కి నష్టమే!


ఇన్నేశుపేట లొతట్టు ప్రాంతంలో తడిసిన ఓవులను ఎత్తుతున్న రైతులు

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం నియోజకవర్గం రైతులు ఎక్కువ శాతం మంది వర్షాల మీద ఆధారపడి వరి సాగు చేస్తారు. ఇచ్ఛాపురం మండలంలో అయితే ఖరీఫ్ మాత్రమే సాగవుతుంది. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో విద్యుత్ మోటార్ల సహాయంతో ఈ ఏడాది ఖరీఫ్ పంట ఆలస్యమైంది. పంట కోతలు నవంబర్, డిసెంబర్‌లో చేశారు. ఆరుగాలం కష్టం చేతికి అందివస్తుందన్న తరుణంలో వరుణుడు రైతుల ఆశలపై నీళ్లు పోశాడు. అకాల వర్షాలు కురవడంతో ధాన్యం ఓవులు నీట మునిగాయి. దీంతో ఇన్నేశుపేట, లొద్దపుట్టి ప్రాంతాల్లో ధాన్యం రంగు మారగా, కేధారిపురం, ముచ్చింద్ర ప్రాంతాల్లో మొలకలు వచ్చేశాయి. అంతా బాగున్న ధాన్యాన్నే ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదు. తడిసిన ధాన్యం ఎవరికి ఎంతకు అమ్ముకోవాలో తెలియక రైతులు ఆందోళన చెందుదున్నాడు. తడిసిన ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టుకునే పనిలో పడ్డారు.


ముచ్చింద్రలో మొలకల ధాన్యం


అయ్యవారిపేట రోడ్డుపై తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

ప్రభుత్వం అదుకోవాలి



గత ఏడాది పంటలు పండకపోవడంతో ఈ ఏడాది వందలాది రూపాయిలు అప్పు చేసి మోటారు బోరుతో రెండు ఎకరాల్లో పంట వేశాను. కోత కోసిన సమయానికి వర్షం కురవడంతో ధాన్యం పూర్తిగా తడిసిపోయాయి. ధాన్యం రంగు మారిపోయాయి. ధాన్యం వైపు చూస్తుంటే గుండె బరువెక్కుతోంది. ప్రభుత్వమే అదుకోవాలి

– ఆశి కొమలమ్మ, లొద్దపుట్టి

అధ్వాన రహదారి..



పలాస మండలంలో మారుమూల గిరిజన గ్రామాలకు వెళ్లే రహదారు అధ్వానంగా ఉన్నాయి. దీంతో గిరిప్రజలు అవస్థలు పడుతున్నారు. మహాదేవపురం, బాపనూరు, గట్టుమీదూరు, కోటారింగ్‌తాళభద్ర, సవరపేటల గ్రామాలకు చెందిన గిరి ప్రజలు నిత్యం నరకయాతన పడుతున్నారు. అధికారులు, నాయకులు స్పందించి పక్కా రోడ్డు నిర్మాణం చేపట్టాలని వారంతా కోరుతున్నారు.

– కాశీబుగ్గ

శిథిలావస్థలో పాఠశాల..



టెక్కలి మండలంలోని గూడెం పంచాయతీ పరిధి సన్యాసి నీలాపురం గ్రామ ప్రాథమిక పాఠశాల తరగతి గదులు శిథిలావస్థలకు చేరుకున్నాయి. శ్లాబ్ పెచ్చులు ఊడి పిల్లపైన పడుతున్నాయిని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

–టెక్కలి రూరల్

కరపత్రం ఆవిష్కరణ..



పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ నాలుగో వార్డు రాజాంకాలనీ పాలపొలమ్మ ఆలయం వద్ద సిక్కోలు కళాజాతర కరపత్రాన్ని శనివారం ఆవిష్కరించారు. ఏడాదికోకసారి నిర్వహించే కళాజాతర ఈసారి వజ్రపుకొత్తూరు మండలం రాజాం గ్రామంలో వచ్చేనెల 12వ తేదీన నిర్వహించనున్నారు. సంస్థ అధ్యక్షులు రాపాక ధనరాజు, రాజాం సర్పంచ్ పిట్ట గీతాజోగారావు, గరుడభద్ర సర్పంచ్ సర్పంచ్ గూడ గిరిజా ఈశ్వరరావు, మాజీ సర్పంచ్ సాంబమూర్తి, వివిధ సంఘాల నాయకులు రాజశేఖర్, కొండే సూరి, కుత్తుం వినోద్, మామిడి గణపతి, విజయకుమార్, మామిడి వాసు, మాధవరావు, ఖగేష్, రాజ్‌కుమార్, అప్పారావు, లోకేశ్వరరావు, రామారావు, ఆనందరావు ఉన్నారు.

–కాశీబుగ్గ

ఆర్థికసాయం..



వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లికి చెందిన రాజమహేంద్ర రాము కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ఉద్దానం హెల్పింగ్ సొసైటీ రూ.10 వేలు సేకరించింది. ఈ మొత్తాన్ని బాధితుడికి సొసైటీ సభ్యులు శనివారం అందజేశారు. గ్రామ పెద్ద సూరాడ మోహనరావు సొసైటీ ప్రతినిధులు కె.చంటి, ఎ.గిరి, కీలు కమల, శాంతి, సావిత్రి, కిరణ్, చంటి, మౌళి, రాజేష్ సాగర్ ఉన్నారు.

–వజ్రపుకొత్తూరు

సైబర్ నేరాలపై అవగాహన


ఇచ్ఛాపురం: విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీఐ చిన్నంనాయుడు


వజ్రపుకొత్తూరు: కిడిసింగిలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నిహార్

ఇచ్ఛాపురం: సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ మీసాల చిన్నంనాయుడు అన్నారు. పట్టణంలోని కేజీబీవీలో విద్యార్థినులతో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మహిళల కోసం ప్రత్యేక చట్టాలు అమల్లో ఉన్నాయన్నారు. తమ శాఖ మహిళల కోసం తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఎస్సై చిన్నంనాయుడు, కేజీబీవీ ప్రిన్సిపాల్ శిరీష ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

వజ్రపుకొత్తూరు: సైబర్ నేరాలపై యువత, మహిళలు అప్రమత్తంగా ఉండాలని వజ్రపుకొత్తూరు ఎస్ఐ బి.నిహార్ అన్నారు. పల్లిసారధి, కిడిసింగి గ్రామాల్లో సంకల్పం కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దొంగతనాలు జరుగుతున్నందున ఇళ్లకు తాళాలు వేసి సుదూర ప్రాంతాలకు వెళ్లేవారు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. న్యూ ఇయర్ విషెస్ పేరుతో సైబర్ మోసాలకు పాల్పడతారని, మీ బ్యాంక్ వివరాలు, యూపీఐ పిన్ వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దన్నారు. యువత మాదక ద్రవ్యాలు, మద్యానికి బానిస కావద్దన్నారు.

నాయకుల పరామర్శ


కంచిలి: ఈశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి తదితరులు


ఇచ్ఛాపురం: గురుస్వామి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ రామారావు తదితరులు

ఇచ్ఛాపురం: పట్టణానికి పంచాయతన అయ్యప్ప స్వామి ఆలయ ధర్మకర్త దుర్గా గురుస్వామి, ఎల్ఐసీ ఏజెంట్ ఎస్ఎన్ పండా భార్య ఇటీవల మృతి చెందారు. వీరి కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ నర్తు రామారావు శనివారం పరామర్శించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు ప్రకాశరావు పట్నాయక్, వార్డు కౌన్సిలర్ బి.జగన్ ఉన్నారు.

కంచిలి: మఠం సరియాపల్లి గ్రామానికి చెందిన నల్లాన ఈశ్వరరావు ఇటీవల గుండెనొప్పితో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి మృతుని కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. ఈశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పించారు. స్థానిక సర్పంచ్ కొణపల సురేష్, ఎంపీటీసీ సభ్యుడు బుడ్డెపు విశ్వనాథం, నేతలు పైల మోహనరావు, లక్ష్మీనారాయణ, గణేష్, జి.భీమారావు ఉన్నారు.

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరుకు చెందిన బుల్లోజు శశిభూషణ్ తండ్రి బి.గురుమూర్తి అనారోగ్యంతో మృతి చెందారు. అతన్ని కుటుంబాన్ని మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ శనివారం పరామర్శించారు. టీపీజీఎస్ చైర్మన్ వజ్జ బాబూరావు, పి.విఠల్ ఉన్నారు.